సాక్షి విశాఖపట్నం

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు

చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. 10లో



పక్కాగా ప్రైవేటు స్కూళ్ల లెక్క

ఒక్క క్లిక్‌తో ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా పాఠశాలల సమగ్ర వివరాలు తెలుసుకునేలా పక్కా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 8లో



విశాఖలో కోచ్ రెస్టారెంట్

విశాఖ రైల్వే స్టేషన్ వద్ద కోచ్ రెస్టారెంట్ అందుబాటులోకి రానుంది. వాల్తేర్ డివిజన్ వినూత్నంగా ఈ ప్రాజెక్టు చేపట్టింది. 10లో

న్యూస్‌రీల్

బాల గణపతిగా సంపత్ వినాయగర్



సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆదివారం బాల గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటలకు హోమం, అభిషేకాలు, 6 గంటలకు మంగళ హారతి నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం కల్పించారు.

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం



కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి స్వాగతం పలుకుతున్న పురందేశ్వరి, నాగేంద్ర

గోపాలపట్నం: కేంద్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీకి ఆదివారం విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఒక్క రోజు పర్యటనలో భాగంగా ఉదయం 8.30 గంటలకు ఆమె విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆమెకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. నగరంలో కార్యక్రమం ముగించుకుని ఉదయం 11.30గంటలకు ఢిల్లీ బయలుదేరారు. ఆమెకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నాయకులు కాశీ రాజు, నాగేంద్ర, సురేంద్ర మోహన్, బాల రాజేశ్వరరావు తదితరులు వీడ్కోలు పలికారు.

నేడు కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాక

మెరైన్ మ్యూజియం ప్రారంభం



మెరైన్ మ్యూజియం

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర మత్స్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖల మంత్రి పర్షోత్తమ్ రూపాల సోమవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 8.15 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి బీచ్‌రోడ్డులో ఉన్న ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) కార్యాలయానికి 11 గంటలకు వెళ్తారు. అక్కడ ఆధునీకరించిన మెరైన్ మ్యూజియంను ప్రారంభిస్తారు. అనంతరం ఎఫ్ఎస్ఐ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రెయినింగ్ (సిఫ్‌నెట్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రెయినింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఆ తర్వాత ఈ మూడు కార్యాలయాలతో పాటు ఫిషింగ్ హార్బర్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విమానంలో పయనమవుతారని ఎఫ్ఎస్ఐ మెకానికల్ మెరైన్ ఇంజినీర్ భామిరెడ్డి తెలిపారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ మేయర్, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం(స్పందన) నిర్వహించనున్నారు.

డాక్టర్ మురళీమోహన్‌రావుకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ మురళీమోహనరావు

మహారాణిపేట: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి, కరోనా పరీక్షల ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.మురళీమోహనరావుకు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. కమ్యూనిటీ నేత్ర ఆరోగ్య సంరక్షణ సేవలకు గుర్తింపుగా బిలాస్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ కమ్యూనిటీ ఆఫ్ అప్తామాలిక్ ఆఫ్ ఇండియా(ఏసీవోఐఎన్) 13వ జాతీయ సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఏసీవోఐఎన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లకేష్ సి మధారియా చేతుల మీదుగా ఈ అవార్డును డాక్టర్ మురళీమోహన్‌రావు అందుకున్నారు.

ముదపాక భూముల్లో తన అనుయాయుల కోసం తెలుగుదేశం ప్రభుత్వం నిర్వహించిన అడ్డగోలు సర్వేలో అసలు నిజాలు ప్రభుత్వం మారిన తర్వాత బట్టబయలయ్యాయి. అర్హులైన లబ్ధిదారులకు మొండి చెయ్యి చూపించేలా పచ్చతమ్ముళ్లకు పప్పు బెల్లాల మాదిరిగా ముదపాక భూముల్ని పంచిపెట్టిన టీడీపీ అక్రమాలకు ప్రభుత్వం కొత్త సర్వేతో అడ్డుకట్ట వేసింది. 179 మంది రైతులను అసలైన అర్హులుగా గుర్తించి వారికి ఎల్‌పీవోలు జారీ చేసింది. ఈ భూముల్లో జగనన్న కాలనీలు నిర్మించి పేదలకు గూడు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. అక్రమంగా లాక్కొన్న భూములు పేదల పరమవుతుండటంతో ఓర్వలేక.. కేసుల పేరుతో **కక్ష తీర్చుకునేందుకు టీడీపీ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.**



ముదపాక భూముల్లో జగనన్న కాలనీల లేఅవుట్స్



రైతుల పేరిట స్వాహాకు యత్నం

- నాటి టీడీపీ అడ్డగోలు సర్వేకు ప్రభుత్వం చెక్
- 2019 డిసెంబర్‌లో మరోసారి ముదపాక భూముల్లో సమగ్ర సర్వే
- అర్హులైన 179 మంది రైతులకు ఎల్‌పీవోలు జారీ
- ఓర్వలేక ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కోర్టుల్లో కేసులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వేలో అర్హులుగా అక్కడి స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అనుచరుల పేర్లనే ఎక్కువగా జోడించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముదపాక భూముల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. వెంటనే కొత్తగా రెవెన్యూ, సర్వే, ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులతో కూడిన బృందాల్ని నియమించి.. మరోసారి పక్కాగా సర్వే నిర్వహించింది. 2019 డిసెంబర్ 26న ఈ బృందాలు సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాయి. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ల బృందాలు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి తుది నివేదికను సిద్ధం చేశాయి. ఈ సర్వేలో టీడీపీ నేతల అడ్డగోలు వ్యవహారాలు బట్టబయలయ్యాయి. అక్కడ సెంటు భూమి కూడా లేని వారి పేర్లతో దాదాపు 34 ఎకరాలను కాజేసేందుకు ప్రయత్నించినట్లు స్పష్టమైంది. వీటన్నింటినీ రద్దు చేశారు. అప్పటి ల్యాండ్‌పూలింగ్ అండ్ ఎన్ఏవోబీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో అనర్హుల జాబితాను తొలగించి 193 మంది అసలైన అర్హుల్ని గుర్తించారు. వీరికి 378.83 ఎకరాల్ని అర్హులకు అందజేస్తున్నట్లు 2020 జనవరి 27 ముదపాక గ్రామ పంచాయతీలో జాబితా ప్రచురించారు. వీరందరికి ల్యాండ్ పొజిషన్ ఓనర్‌షిప్(ఎల్‌పీవో) సర్టిఫికెట్స్ కూడా జారీ చేశారు.

పేదలందరికీ ఇళ్ల కోసం..

ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్ని గుర్తించిది. ఇందులో భాగంగా ముదపాక భూములను కూడా ఎంపిక చేశారు. నిర్మాణ యోగ్యమైన భూముల్ని గుర్తించాలని నిర్ణయించారు. అప్పటి పెందుర్తి తహసీల్దార్ బాబ్జీ.. మరోసారి జాబితాను పరిశీలించారు. వీరిలో నిజమైన అసైనీలు 179 మంది మాత్రమే ఉన్నారని గుర్తించి వారికి బార్‌కోడింగ్‌తో కూడిన ఎల్‌పీవోలు జారీ చేశారు. 14 మందిని అనర్హులుగా తేల్చారు. అదేవిధంగా.. ముదపాకలో ఉన్న భూముల్లో సర్వే నం.1లో కొంత భాగం కొండ ప్రాంతం కావడంతో నిర్మాణయోగ్యం కాదని గుర్తించారు. వాటిని కూడా జగనన్న కాలనీల జాబితా నుంచి మినహాయించారు. మిగిలిన భూములకు సంబంధించి ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ చేపట్టేందుకు వీఎంఆర్‌డీఏ 2020 జనవరి 27న నోటిఫికేషన్ ప్రచురించింది. పెందుర్తి మండలానికి సంబంధించి ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ పూర్తి చేసి సమీకరించిన భూములను అదే ఏడాది మార్చి 2న వీఎంఆర్‌డీఏకు పెందుర్తి తహసీల్దార్ సమక్షంలో అప్పగించారు. ఇందులో ముదపాకలోని సర్వే నం.38లో 85.60 ఎకరాలు, సర్వే నం.76లో 247.99 ఎకరాలు, సర్వే నం.1లో 106.27 ఎకరాలు చొప్పున మొత్తం 439.86 ఎకరాలు ఉన్నాయి.

అడ్డం తిరిగిన 'టీడీపీ' రైతులు

ఈ భూములను అభివృద్ధి చేసి జగనన్న కాలనీ ఇళ్లు నిర్మించి బల**హీన వర్గాలకు అందించేందుకు ప్రభుత్వం** సన్నద్ధమైంది. వీఎం**ఆర్‌డీఏ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ** ఆధ్వర్యంలో గ్రౌండింగ్ **పనులు ప్రారంభించారు. సర్వే నం.1,** 76లో 266.03 ఎకరాల విస్తీర్ణంలోనూ, సర్వే నం.66, 71/2, 75, 80, 83/2లోని 50.24 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ సిద్ధం చేశారు. మరోవైపు అసైనీలు, ఆక్రమణదారుల నుంచి అంగీకారం పొందే ప్రక్రియను కూడా ప్రారంభించారు. ముందుగా అంగీకారం తెలిపిన రైతుల్లో కొంత మంది టీడీపీ నేతల ప్రోద్బలంతో అడ్డం తిరిగారు. తొలుత స్వచ్ఛందంగా అంగీకారం తెలిపిన రైతులు.. రెవెన్యూ యంత్రాంగం సర్వే నివేదికలను మార్చేసి తమకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని.. తిరిగి తమ భూములు తమకు ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ రైతులకు సంబంధించిన భూముల్లో లేఅవుట్స్ ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది. ఇలా.. పేదలకు ఇళ్లు అందించాలన్న లక్ష్యాన్ని టీడీపీ నేతలు నీరుగార్చి.. ఆ భూములు పేదలకు దక్కకుండా తమ పరం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

వెనక్కి వచ్చిన ఎయిరిండియా విమానం

- సాంకేతిక లోపమే కారణం
- ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం బయలు దేరిన కొద్ది సేపటికే తిరిగి వచ్చేసింది. ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖ నుంచి ఢిల్లీ బయలు దేరిన ఎయిర్ ఇండియా విమానం సాంకేతిక లోపం కారణంగా సాయంత్రం 6.30 గంటలకు తిరిగి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంది. ఈ విమానంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత్ నాయక్‌తో పాటు మరో ముగ్గురు సభ్యులు ఉన్నారు. 165 మంది ప్రయాణికులకు విమానాయాన సంస్థ ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేసింది.

వచ్చే నెలలో వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు

మురళీనగర్: విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 29న వెటరన్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.బాబూరావు, మంగా వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలు విశాఖ పోలీసు బ్యారెక్స్ గ్రౌండ్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో 30 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుష అథ్లెటిక్స్ పాల్గొనవచ్చన్నారు. రన్నింగ్ (100మీ./200మీ/400మీ/800మీ/ 1500మీ/5000మీ), వాకింగ్ (5కి.మీ), లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, జావలిన్ త్రోస్, డిస్కస్, హిమర్ త్రో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారిని నవంబరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు 9701347311, 9866668966, 8309157522, 9247424395 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కేకే లైన్‌లో విరిగి పడిన కొండ చరియలు

పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం



రైల్వే ట్రాక్‌పై కొండ చరియలు

తాటిచెట్లపాలెం: కొత్తవలస-కిరండూల్(కేకే) లైన్ మనబార్-జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై ఆదివారం తెల్లవారుజామున కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు.

గమ్యం కుదించిన రైళ్లు

- రూర్కెలా-జగదల్‌పూర్(18107) ఎక్స్‌ప్రెస్ ఆదివారం కోరాపుట్ వరకే నడిచింది. జగదల్‌పూర్-రూర్కెలా (18108) ఎక్స్‌ప్రెస్ సోమవారం కోరాపుట్ నుంచి బయలుదేరుతుంది.
- భువనేశ్వర్-జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం కోరాపుట్ వరకే నడిచింది. జగదల్‌పూర్-భువనేశ్వర్(18448) సోమవారం కోరాపుట్ నుంచి బయలుదేరుతుంది.
- ఆదివారం రాత్రి బయలుదేరిన విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడిచింది. కిరండూల్-విశాఖపట్నం(18513)ఎక్స్‌ప్రెస్ సోమవారం కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- సోమవారం ఉదయం బయలుదేరే విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ సోమవారం అరకు నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- హౌరా-జగదల్‌పూర్(18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ ఆదివారం రాయగడ వరకే నడిచింది. జగదల్‌పూర్-హౌరా(18006) ఎక్స్‌ప్రెస్ సోమవారం రాయగడ నుంచి హౌరా బయలుదేరుతుంది.

2 వరకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్(డీసీఎం) ఎ.కె త్రిపాఠి తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండ్రి (07466/07467) పాసింజర్ స్పెషల్, గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, రాయగడ-గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. ఈ నెల 25, 26, 27, 29, 30 తేదీల్లో విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం (22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ను ఇరువైపులా రద్దు చేసినట్లు డీసీఎం వెల్లడించారు. మిగిలిన రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, 24, 26వ తేదీల్లో హతియా-ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్, 25న హతియా-ఎర్నాకుళం(22837) ఎక్స్‌ప్రెస్, 27న జసిద్ధి-తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 28న టాటానగర్-యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, 29న టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్‌లు రెగ్యులర్ మార్గం నిడదవోలు-ఏలూరు-విజయవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు-భీమవరం టౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా నడుస్తాయి.

సత్సంబంధాలతోనే ఉన్నతమైన తీర్పులు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- జిల్లా కోర్టు ఆవరణలో నూతన భవన సముదాయం ప్రారంభం



కోర్టు భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న హైకోర్ట్ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



బార్ కౌన్సిల్ సభ్యులు, విశాఖ జిల్లా కోర్టుల న్యాయమూర్తులతో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

విశాఖ లీగల్: జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన పది న్యాయస్థానాల నూతన భవనాలను ఆదివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రారంభించారు. ముందుగా చీఫ్ జస్టిస్‌కు కలెక్టర్ ఎ.మల్లికార్జున స్వాగతం పలికారు. కోర్టు సముదాయం నిర్మాణానికి సంబంధించిన పలు విషయాలను కలెక్టర్ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ న్యాయమూర్తులు.. న్యాయవాదుల మధ్య సత్సంబంధాలు ఉన్నతమైన తీర్పులకు దిశా నిర్దేశం చేస్తాయన్నారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, విశాఖ పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 10 న్యాయస్థానాలను 10 దేవాలయాలుగా అభివర్ణించారు. రావిశాస్త్రి, డి.వి.సుబ్బారావు, రంగనాథం వంటి న్యాయవాదులు విశాఖ వాసులు కావడం ఈ ప్రాంత వాసుల అదృష్టమన్నారు. ప్రస్తుతం విశాఖలో 71 న్యాయస్థానాలు ఉన్నాయని.. వాటిలో 29 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. నూతనంగా నిర్మించిన న్యాయ స్థానాలకు 15,133 కేసులు బదిలీ చేస్తున్నట్లు వివరించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ విశాఖలో తాను తొమ్మిదేళ్లు పనిచేశానని.. ఎన్నో ఉన్నతమైన తీర్పులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. 1996లో జరిగిన న్యాయవాదుల వందేళ్ల పండగకు తాను కీలక పాత్ర వహించినట్లు చెప్పారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్ సోమయాజులు మాట్లాడుతూ కక్షిదారుల ఔన్నత్యాన్ని గుర్తించి, వారిని గౌరవించాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మాట్లాడుతూ న్యాయస్థానాలు ఏర్పాటు కంటే వాటిని నిత్యం అందంగా ఉంచడం, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ముఖ్యమన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ తొలి దశలో పది న్యాయ స్థానాలను కొత్త భవనాల్లోకి మారుస్తున్నామన్నారు. ప్రముఖ న్యాయవాది కె.వి.రామ్మూర్తి మాట్లాడుతూ సమస్యలు సహజమని వాటిని అర్థం చేసుకుని న్యాయస్థానాల్లో సరైన పద్ధతిలో వాదిస్తే సానుకూల తీర్పు లు వస్తాయన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు నివేదిక సమర్పించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ దేశంలోనే ది బెస్ట్ బార్‌గా గుర్తింపు పొందిందన్నారు. 6,000 మందికి పైగా న్యాయవాదులు ఇక్కడ ఉన్నారని, ముఖ్యంగా మహిళా న్యాయవాదులు అధిక శాతం ఉండడం అభినందనీయమన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి పైల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ సభ్యు లు పి.నర్సింగరావు, బైపా అరుణ్ కుమార్ తదితరులు ప్రసంగించారు. విశాఖపట్నం, అనకాపల్లి, చోడవరం, గాజువాక, యలమంచిలి నుంచి న్యా యవాదులు హాజరయ్యారు. మహిళా న్యాయవాదు ల సంఘం అధ్యక్షురాలు డి. మంజులత, నాయకులు లక్ష్మీ రాంబాబు, బి.ఎస్.లత, సీనియర్ న్యాయవాదులు కె.నరసింహమూర్తి, కందాల శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసమూర్తి, ఎం.రవి, హబీబుల్లా పాల్గొన్నారు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వీడ్కోలు

గోపాలపట్నం: రెండు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదివారం సాయంత్రం 4 గంటలకు విజయవాడ పయనమయ్యారు. విశాఖ విమానాశ్రయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.గిరిధర్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, అదనపు న్యాయమూర్తి లాలం శ్రీధర్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏడీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ(ట్రాఫిక్) జి.రాజీవ్‌కుమార్, పశ్చిమ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, బార్ అసోసియేషన్ సభ్యులు చీఫ్ జస్టిస్‌కు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఉల్లాస అడుగు.. ఉత్సాహ పరుగు

వైజాగ్ బే మారథాన్‌కు విశేష స్పందన



మారథాన్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు, సీపీ రవిశంకర్



సాగర తీరం వెంట పరుగు పెడుతున్న ఔత్సాహికులు

విశాఖ స్పోర్ట్స్: సాగరతీరంలో ఆదివారం వైజాగ్ బే మారథాన్ ఉత్సాహంగా సాగింది. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద సూర్యుడి లేలేత కిరణాలు తాకుతుండగా వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన ఈ పరుగులో వయోభేదం లేకుండా ఔత్సాహికులు పాల్గొన్నారు. చాలెంజింగ్ 21కే హాఫ్ మారథాన్ విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమై జీవీపీ కళాశాల వద్ద టర్న్ తీసుకుని తిరిగి చేరుకోవడంతో ముగిసింది. 10 కిలోమీటర్ల పరుగు తెన్నేటి పార్కు వద్ద, ఐదు కిలోమీటర్ల పరుగు కరకచెట్టు రోడ్ వద్ద, మూడు కిలోమీటర్ల పరుగు సాగర తీరంలోని వైఎస్సార్ విగ్రహం చెంత టర్న్ తీసుకుని ప్రారంభం వద్దకు చేరడంతో ముగిసింది. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఆడిటర్ జి.వి, మారథాన్ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా పాల్గొన్న యువతులు



ఉత్సాహపరుస్తున్న బాంగ్రా నృత్య వాయిద్యకారులు

మంత్రికి సచివాలయ ఉద్యోగుల వినతి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న వార్డు/గ్రామ సచివాలయ అసోసియేషన్ ప్రతినిధులు

మహారాణిపేట: తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కోరారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ్ సుతేజ్, జిల్లా అధ్యక్షులు గణేష్ కుమార్ ఆదివారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ పరిధిలోని 578 మంది వార్డు పరిపాలన కార్యదర్శులకు పీవోఎస్ మిషన్లు అందజేసి.. 25 రకాల పన్నులు వసూలు చేయాలని ఉన్నతాధికారులు సూచించారన్నారు. ఈ ప్రక్రియలో ఉత్పన్నమయ్యే సమస్యలను అధికారులకు వివరించినట్లు చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి పునరాలోచన చేయలేదని, లోపాలను సరిదిద్దలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల తర్వాత ఈ సమస్యపై సమీక్షిస్తానని హామీ ఇచ్చినట్లు భార్గవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ తెలిపారు.

బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్

సీతమ్మధార : బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకోవాలని ప్రజాశాంతి అధ్యక్షుడు కె.ఎ.పాల్ తెలిపారు. కేపీ పాల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను రూ.8 లక్షల కోట్లకు అమ్మేస్తోందన్నారు. దీనిపై తాను కేసు వేసినట్లు తెలిపారు. దేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్‌ల నుంచి ప్రజలు రక్షించుకోవాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడన్నారు. పవన్ కల్యాణ్ టీడీపీ, బీజేపీ జెండాలు మోస్తూ ప్రజలను కూడా మోయమని చెబుతున్నాడన్నారు. ప్రజాశాంతి అధికారంలోకి వస్తే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తానన్నారు.

టూరిజానికి కేరాఫ్ బొజ్జన్నకొండ



బొజ్జన్నకొండ టూరిజం పనులకు భూమిపూజ చేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, దంతులూరి దిలీప్‌కుమార్, బొడ్డేడ ప్రసాద్, దాడి రత్నాకర్

- అనకాపల్లి అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ
- అంతరాతీయ స్థాయిలో అనకాపల్లికి గుర్తింపు
- అనకాపల్లిలో రూ.3 కోట్లతో టీటీడీ కల్యాణమండపం
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- రూ.7.3 కోట్లతో బొజ్జన్నకొండ అభివృద్ధి పనులకు భూమిపూజ

తుమ్మపాల : బొజ్జన్నకొండను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి జిల్లాలో టూరిజం అభివృద్ధితో పాటు పారిశ్రామిక జిల్లాగా చేసేందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలో శంకరం గ్రామంలో గల బొజ్జన్నకొండ వద్ద ఎంపీ బి.వి.సత్యవతి ఆధ్వర్యంలో టూరిజం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బెల్లానికి గుర్తింపుగా ఉన్న అనకాపల్లి, ఇక నుంచి బొజ్జన్నకొండ ద్వారా పర్యాటకానికి కేరాఫ్‌గా మారనుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బొజ్జన్నకొండ అభివృద్ధికి రూ.7.3 కోట్ల నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయన్నారు. కేంద్రంలో అర్కియాలజీ శాఖ అనుమతులు, కేంద్ర నిధుల మంజూరులో ప్రత్యేక చొరవ తీసుకుని ఈ కార్యక్రమానికి ఎంపీ బి.వి.సత్యవతి ఎనలేని కృషి చేశారని అభినందనలు తెలిపారు. జిల్లాలో మెడికల్ కళాశాల నిర్మాణం కూడా వేగంగా జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో రాష్ట్రంతో పాటు, జిల్లాను మరింత అభివృద్ధి చేసుకునేందుకు అందరం కలిసి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ మన ప్రాంతానికే తలమానికంగా ఉన్న బొజ్జన్నకొండ అభివృద్ధిపై పట్టువదలని విక్రమార్కుడిలా ఎంపీ కృషి చేశారని అన్నారు. వై.వి.సుబ్బారెడ్డి చొరవతో రూ.3 కోట్లతో అనకాపల్లిలో టీటీడీ కల్యాణమండపం, టికెట్ కౌంటర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఎంపీ సత్యవతి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలతో చర్చించి నిధులు మంజూరుతో పాటు పనులు ప్రారంభానికి విశేష కృషి చేశారన్నారు. రానున్న జనవరి నాటికి పనులు పూర్తి చేసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కార్యాచరణ వేగం చేయాలన్నారు. ఎంపీ బి.వి.సత్యవతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7.3 కోట్ల నిధులలో రూ.2.5 కోట్లతో భవనాలు నిర్మాణానికి కేటాయించినప్పటికి అర్కియాలజీ శాఖ నిబంధనల ప్రకారం బొజ్జన్నకొండ పరిసరాలలో అనుమతులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో స్థల సేకరణ చేశామన్నారు. ఈ సమస్య తలెత్తినప్పుడు విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లగా ఆయన తక్షణమే స్పందించి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న స్థలాన్ని టూరిజం శాఖకు బదలాయిస్తూ వెంటనే మంజూరు చేయడంతో ఈ రోజున వై.వి.సుబ్బారెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేసి పనులు ప్రారంభించడం శుభపరిణామన్నారు. బొజ్జన్నకొండపై లైటింగ్ షో ఏర్పాటుకు రూ.5 కోట్ల మేర ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. లైటింగ్‌తో పాటు, బౌద్ధ చరిత్ర, టాయిలెట్, పార్కింగ్, వైఫై, సీసీ కెమెరా సరిఫ్లెన్స్, బుద్ధుని జ్ఞాన మందిరం, రెస్టారెంట్, జాతీయ రహదారి ప్రారంభంలో ముఖద్వారంలా శిలాతోరణం ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణాన్ని రూ.1.43 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులతో చేపడుతున్నామన్నారు.

పక్కాగా ప్రైవేటు స్కూళ్ల లెక్క

- ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయాల్సిందే..
- గుర్తింపు, రెన్యువల్‌కు ప్రత్యేకంగా 'స్కూల్ మానిటరింగ్ యాప్'
- నిబంధనలు పాటిస్తేనే నిర్వహణకు అనుమతులు
- ప్రైవేటు స్కూళ్లలో అడ్డగోలు ఫీజులకు అడ్డుకట్ట
- స్కూళ్ల యాజమాన్యాలకు అవగాహన సదస్సులు

నగరంలోని ఎస్పీడీ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం సీబీఎస్ఈ చదువుల పేరుతో ఆర్భాటపు ప్రచారం చేసి, విద్యార్థులను చేర్చుకున్నారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేశారు. కానీ ఆ పాఠశాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి పొందిన గుర్తింపు గడువు ముగిసింది. 2023–24 విద్యా సంవత్సరానికి రెన్యువల్ లేకుండానే అడ్మిషన్లు చేపట్టిన విషయం తనిఖీలకు వెళ్లిన విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఎందుకిలా చేశారని ఆ పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా బ్రాంచిలను నిర్వహిస్తున్న ఓ కార్పొరేట్ పాఠశాలకు నగరంలోని మూడు బ్రాంచిలకు ప్రభుత్వ పరంగా గుర్తింపు రెన్యువల్ ఇవ్వలేదు. పాఠశాల నిర్వహిస్తున్న భవనానికి తగిన ధ్రువ పత్రాలు సమర్పించలేదనే కారణంతో వారికి విద్యాశాఖాధికారులు నోటీసులు జారీ చేశారు. కానీ 2023–24 విద్యా సంవత్సరానికి ఆ పాఠశాల యాజమాన్యం దర్జాగానే విద్యార్థులను చేర్చుకొని, ఇష్టానుసారం ఫీజుల వసూలు చేసేసింది.

విశాఖ విద్య: దినదినాభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ఇబ్బడిముబ్బడిగా విద్యాలయాలు వెలుస్తున్నాయి. కానీ సరైన వసతులు, అర్హత గల ఫ్యాకల్టీ, ప్రభుత్వ పరంగా తగిన అనుమతులు లేకుండానే పాఠశాలలు నిర్వహిస్తూ, విద్యార్థుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే కాలేజీ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యా శాఖల్లో అమలు చేస్తున్న విధంగానే ప్రైవేటు పాఠశాలల సమస్త సమాచారాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు నిర్ణయించింది. ఒక్క క్లిక్‌తో ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా పాఠశాలల సమగ్ర వివరాలు తెలుసుకునేలా పక్కా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ప్రైవేటు యాజమాన్యాలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

వివరాలు నమోదుకు ప్రత్యేక యాప్

విద్యాశాఖ రూపొందించిన 'స్కూల్ మానిటరింగ్ యాప్'లో ప్రైవేటు స్కూళ్ల సమస్త సమాచారం నమోదు చేయాలి. సొసైటీల ద్వారా నిర్వహిస్తున్నట్లయితే, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్ ధ్రువపత్రాలతో పాటు, పోలీసు శాఖ నుంచి కూడా అనుమతి తీసుకొని ఆ పత్రాలను యాప్‌లో నమోదు చేయాలి. స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరి అర్హత సర్టిఫికెట్లు కూడా పొందుపరచాలి. విద్యాశాఖ నుంచి కేటాయించిన యు–డైస్ కోడ్ ద్వారానే భవిష్యత్‌లో పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోవాలి. దీని వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు ముందుగానే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా ..? లేదా..? పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఏ మేరకు అర్హతలు ఉన్నాయి అనేది తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ఫీజులు కూడా వసూలు చేయాలి.

యాజమాన్యాలకు అవగాహన

2023–24 విద్యా సంవత్సరం నుంచే నూతన విధానం ద్వారా ప్రైవేటు స్కూళ్లకు గుర్తింపు, రెన్యువల్ ధ్రువపత్రాలను జారీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ జ్యోతి కుమారి ఇటీవల ప్రైవేటు యాజమాన్యాలకు సదస్సు ఏర్పాటు చేశారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే, ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా పాఠశాలలకు అనుమతులు పొందే విధంగా ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేసింది. స్కూళ్ల సమాచారం అంతా ఆన్‌లైన్ చేయాలనేది మంచి నిర్ణయమే అయినప్పటికీ, దీనికి కొంత గడువు ఇవ్వాలని స్కూళ్ల యాజమాన్యాల అసోసియేషన్ (ఏపీపీయుఎస్‌ఎంఏ) జిల్లా అధ్యక్షుడు ఎంపీ రావు కోరారు.

బంధువును రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆరిలోవ: జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌కు చెందిన పైడి శ్రీను(24) అతను బంధువు(పిన్ని కుమారుడు) మచ్చ రాజేష్ కలిసి ఉదయం 5.30 గంటలకు బైక్‌పై రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద నగరం వైపు వెళ్తున్న సమయంలో మధురవాడ నుంచి నగరానికి వస్తున్న లారీ వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో కిందపడిన శ్రీను తలకు తీవ్రగాయమై సంఘటన స్థలంలో మృతి చెందాడు. వెనుక కూర్చున్న రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శ్రీను మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. శ్రీను తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీను ఓ ప్రైవేట్ సంస్థలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనుకు తండ్రి రాంబాబు, అమ్మ, అక్క ఉన్నారు. బావ బైక్‌పై తన పిన్ని కుమారుడు రాజేష్‌ను బెంగుళూరు వెళ్లే ట్రైన్ ఎక్కించడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.



శ్రీను మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువు రాజేష్

మహిళ అనుమానాస్పద మృతి

- 93వ వార్డు పరిధి బాలాజీ గార్డెన్స్‌లో ఘటన
- పరిశీలించిన సీపీ రవిశంకర్



వివరాలు సేకరిస్తున్న డీసీపీ ఆనంద్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్



డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

సింహాచలం: 93వ వార్డు పరిధి గోపాలపట్నం ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న బాలాజీ గార్డెన్స్‌లోని ఎస్ఎస్‌టీఎల్ కాలనీలో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. సంచలనం రేకెత్తించిన ఈ ఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. డీసీపీ ఆనంద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొడుకుల రాధాగాయత్రి(45), ఆమె భర్త నరేంద్ర ఎస్ఎస్‌టీఎల్ కాలనీలో అద్దె ఇంట్లో గత ఆరు నెలల నుంచి ఉంటున్నారు. నరేంద్ర వీఎస్‌పీఈజెడ్‌లో పనిచేస్తున్నారు. నరేంద్ర అప్పుడప్పుడూ ఇంటికి వచ్చి వెళ్తుండటంతో ఆమె ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నారు. రాధాగాయత్రికి శ్రీనివాసనగర్‌లో ఉంటున్న కల్పన అనే బ్యూటీషియన్‌తో కొంతకాలంగా స్నేహం ఉంది. రాధాగాయత్రి, కల్పన గతంలో బాలాజీ గార్డెన్స్‌లోనే అద్దె ఇళ్లలో ఉండేవారు. ఈనెల 21వ తేదీన ఒంట్లో బాగోలేదని రాధాగాయత్రి కల్పనకు చెప్పింది. దీంతో ఆరోజు ఉదయం తన కూతురు గీతికతో కలిసి రాధాగాయత్రి ఇంటికి వచ్చి టిఫిన్ ఇచ్చింది. ఆ రోజు మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు పలుమార్లు కల్పన ఫోన్ చేసినా రాధాగాయత్రి లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆదివారం సాయంత్రం కల్పన తన కూతురు గీతికతో కలిసి రాధాగాయత్రి ఇంటికి వచ్చింది. గీతిక బయటి నుంచి పిలవగా ఎంతకీ పలకలేదు. ఇంటి పెరటి వైపు ఉన్న డోరు తీసి ఉండటంతో లోపలకి వెళ్లి చూసింది. ఇంట్లో రాధాగాయత్రి మృతి చెంది ఉండటాన్ని చూసి భయంతో బయటకి వచ్చేసింది. వెంటనే విషయాన్ని స్థానిక వలంటీర్ సత్యశ్రీకి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వచ్చిన సత్యశ్రీ పెందుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చింది. రాత్రి 8 గంటల సమయంలో ఘటనా స్థలానికి చేరుకున్న డీసీపీ ఆనంద్‌రెడ్డి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, పెందుర్తి సీఐ శ్రీనివాసరావు పరిశీలన జరిపారు. డాగ్‌స్క్వాడ్‌తో కూడా పరిశీలించారు. విషయం తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ కూడా సంఘటన స్థలానికి వచ్చి పరిశీలన జరిపారు. చుట్టుపక్కల ఉన్న వాళ్లను, కల్పన కూతురు గీతికని, వలంటీర్ సత్యశ్రీలను విచారించారు. ఆమె భర్త నరేంద్రకి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో నరేంద్ర పనిచేస్తున్న ఆఫీసుకి పోలీసులను పంపిస్తున్నట్టు డీసీపీ తెలిపారు. విచారణలో అన్ని విషయాలు తేలుతాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా రాధాగాయత్రి ఒక్కరే ఇంట్లో ఉంటోందని, నరేంద్ర ఆమె భర్త కాదేమో అన్న అనుమానాలు సంఘటన స్థలంలో చోటుచేసుకున్నాయి.



రాధా గాయత్రి(ఫైల్)

రెజ్లింగ్‌లో విశాఖ బాలికల సత్తా



అండర్–17 బాలికల విభాగంలో చాంపియన్‌షిప్ విశాఖపట్నం జట్టు

నున్న(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్–14, 17 రెజ్లింగ్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. అండర్–14 బాలుర టైటిల్‌ను ఉమ్మడి కృష్ణా జిల్లా కైవసం చేసుకుంది. బాలికల విభాగంలో చిత్తూరు జట్టు చాంపియన్‌గా నిలవగా, అండర్–17 బాలుర టైటిల్‌ను నెల్లూరు జిల్లా, బాలికల చాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం జిల్లా గెలిచింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో చాంపియన్‌షిప్‌లతో పాటు విజేతలకు పతకాలను వికాస్ విద్యాసంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి అందజేశారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు మహర్దశ



2వ స్థానం సాధించిన విశాఖపట్నం జట్టు

- ముగిసిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ
- ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఏలూరు, విశాఖ జిల్లాల జట్లు

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు రానున్న రోజుల్లో మహర్దశ పట్టనుందని ఏలూరు ఎంపీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ అన్నారు. గత మూడు రోజులుగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్టేట్ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర ఉన్న రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ జాతీయస్థాయిలో అత్యధిక టోర్నమెంట్‌లను నిర్వహించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. అనంతపురంలో వచ్చే వారం నుంచి ఆల్ ఇండియా సబ్ జూనియర్ నేషనల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో టోర్నమెంట్‌ల నిర్వహణకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సుధాకర్, నెల్లూరు జిల్లా సీనియర్ క్రీడాకారుడు రమేష్ బాబును ఘనంగా సన్మానించారు.

బహుమతి ప్రదానోత్సవం

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా ఏలూరు జిల్లా, 2వ స్థానంలో విశాఖపట్నం జిల్లా, 3వ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలు నిలిచాయి. అతిథులు ఆయా జట్లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.133
స్కిన్	: రూ.236
స్కిన్‌లెస్	: రూ.246

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,950
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,950
వెండి(కిలో):	రూ.79,300

చిన్నారుల్లో క్యాన్సర్.. ఆందోళనక్కర్లేదు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో చిన్నారులు



విక్టరీ సింబల్ చూపిస్తున్న క్యాన్సర్‌ను జయించిన చిన్నారి

సీతమ్మధార: చిన్నారుల్లో క్యాన్సర్ ఉంటే ఆందోళనక్కర్లేదని.. వైద్యుల సూచనలు పాటిస్తే 90 శాతం వరకు నయం చేయవచ్చని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి పీడియాట్రిక్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రజని ప్రియ అన్నారు. చైల్డ్ హుడ్ క్యాన్సర్ అవగాహన నెల సందర్భంగా క్యాన్సర్‌ను జయించిన బాలబాలికలతో 'బి బోల్డ్.. గో గోల్డ్' నినాదంతో ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సెంట్రల్ పార్కులో చిన్నారులు సందడి చేశారు. వారికి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి.. బహుమతులు అందజేశారు. మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అతి భయంకరమైన వ్యాధిని అత్యంత విశ్వాసంతో జయించిన చిన్నారులకు అభినందనలు తెలిపారు. బాల్య దశ రోగుల సంరక్షణకు ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాన్ని నడుపుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలో ప్రతీ మూడు నిమిషాలకు ఓ బిడ్డ క్యాన్సర్‌తో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల్లో అనుమానిత లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి, వారి సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- హెచ్‌ఎంను కొట్టాడంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- నోటీసు ఇచ్చి పంపించామని పోలీసుల వెల్లడి
- రంగంలోకి దిగిన ఎస్పీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన దానయ్య(17) ఆదివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మనస్తాపం వల్లే అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో సున్నితమైన అంశం కావడంతో ఎస్పీ స్థాయి అధికారులు రంగంలోకి దిగారు. ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తుండగా, డీఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పూర్వ విద్యార్థి దానయ్య రెండు రోజుల క్రితం పూడిమడక ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడి ప్రధానోపాధ్యాయునిపై చేయి చేసుకోవడంతో పాటు సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులను టీజింగ్ చేశాడని తెలిపారు. దీంతో హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సదరు పూర్వ విద్యార్థిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి నోటీసు ఇచ్చి పంపించామన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన కారణం, ఉన్నత పాఠశాలలో వివాద అంశాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తామన్నారు. మరోవైపు పోలీసులు దుర్భాషలాడటంతో మనస్తాపానికి గురై దానయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడనేది అతడి కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీసీ కోసం హెచ్‌ఎం పలుమార్లు తిప్పించడం వల్లే గొడవ జరిగి ఉంటుందని, అనంతరం పోలీసు కేసులోకి వెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడని మృతుడి సన్నిహితులు వాపోతున్నారు. కుమారుడి మృతితో తల్లి తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయింది.



దానయ్య (ఫైల్)